ఘనంగా కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం

మొయినాబాద్, మార్చి 14 : మండల పరిధిలోని సురంగల్ గ్రామంలో పెద్ద చెరువు కట్ట మీద పునఃనిర్మాణం చేపట్టిన ఆలయ వార్షికోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గురువారం ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మాజీ అధికారి రాములు, మాజీ సర్పంచ్ దంపతులు గడ్డం లావణ్యాఅంజిరెడ్డి, మాజీ సర్పంచ్ అవుసుల లావణ్యాభాస్కరాచారి, మాజీ వార్డు సభ్యులు అనితామహేందర్‌రెడ్డి, కందికొండ మల్లేశ్‌గౌడ్ దంపతులు, నర్సింహారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాజీ వార్డు సభ్యుడు గడ్డం వెంకట్‌రెడ్డి అన్నదానం చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

మంచాల, మార్చి 14: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను వారు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా శిథిలావస్థలో ఇండ్లు ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇచ్చి వారికి ఇండ్లు మంజూరు చేయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కావలి బుగ్గరాములు, మాదగోని జంగయ్యగౌడ్, రావుల భాషా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగబలిజ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

మంచాల, మార్చి 14 : రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని వీరశైవలింగాయత్ మండల అధ్యక్షుడు కొత్తూరు శేఖరప్ప అన్నారు. గురువారం ఆయన మంచాలలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు. వేదవీరశైవ లింగాయత్ సంక్షేమానికి ఈ కార్పొరేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఇష్టపడి చదవాలి

కడ్తాల్, మార్చి 14 : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా అన్నారు. గురువారం ముద్విన్ గ్రామంలో గల విద్యాభారత్ మాడల్ స్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి స్నేహితులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ పరమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశ్, ఉపాధ్యాయులు శోభారాణి, ఉమారాణి, మౌనిక, మమత, సరిత తదితరులు పాల్గొన్నారు.

పాల బిల్లులను వెంటనే చెల్లించాలి

- పాలశీతలీకరణ కేంద్రం వద్ద పాడి రైతుల ఆందోళన

మండల కేంద్రంలోనిఇ పాలశీతలీకరణ కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న పాడి రైతులు

కడ్తాల్, మార్చి 14: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని పాడి రైతులు డిమాండ్ చేశారు. పాల బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రం నిర్వాహకులు, పాడి రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల నుంచి పాడి రైతులకు పాల బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పదిహేను రోజులకొకసారి చెల్లించాల్సిన పాల బిల్లులు అరవై రోజులు దాటుతున్నా రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో పశుదాణాను కొనుగోలు చేయలేకపోతున్నామని రైతులు వాపోయారు. పాడి రైతుల కోసం ప్రభుత్వం రూ.200 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. అదే విధంగా పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న లీటర్‌కు రూ.4 పాల ప్రోత్సాహక బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. అధికారంలోకి రాగానే పాల ప్రోత్సాహక ధరను రూ.5 పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వం వచ్చి వంద రోజులు అవుతున్నా, ఎలాంటి ప్రకటన చేయలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం సకాలంలో పాల బిల్లులు చెల్లించకపోతే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడారి రామకృష్ణ, ముత్తి రంగయ్య, నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాచిరెడ్డి అశోక్ రెడ్డి, సిద్ధిగారి కుమార్, సిరిగిరి సాయిప్రభు, కాకర్ల సత్యం, నరేశ్, నార్లకంటి శేఖర్, గురిగళ్ల శంకరయ్య, గిరిధర్, గురిగళ్ల రమణ, రాజేశ్, రంగా, గణేశ్, లింగం, శ్రీశైలం పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 14 : ఇంటర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. షాద్‌నగర్ పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,859 మంది విద్యార్థులకుగాను 1,743 మంది హాజరుకాగా 116 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ పరీక్షలకు 303 మంది కిగాను 277 మంది విద్యార్థులే హాజరు కాగా 26 మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్లు శ్రీకాంత్, చంద్రశేఖర్ తెలిపారు. ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం కేంద్రాల నుంచి బాయ్ బాయ్ చెప్పుకుంటూ తమ ఇండ్లకు వెళ్లిపోయారు. కాగా ఒకేషనల్ పరీక్షలు మాత్రం శనివారం ముగుస్తాయని తెలిపారు.

శివాలయ అభివృద్ధికి సహకరించాలి

కడ్తాల్, మార్చి 14 : శివాలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని శివాలయంలో దత్తాత్రేయస్వామి విగ్రహం, ఆలయ ఆవరణలో మండప నిర్మాణానికి గురువారం గ్రామానికి చెందిన గంజి వెంకటేశ్ రూ.1,01 లక్షలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

రేషన్ బియ్యం విక్రయిస్తే చర్యలు

మండల కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న డీటీ రఘునందన్

కడ్తాల్, మార్చి 14 : రేషన్ బియ్యాన్ని అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల్లోని బియ్యం నిల్వలను, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఫరూఖ్ హుస్సేన్

ఆమనగల్లు, మార్చి 14 : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంపీడీవో ఫరూఖ్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ క్రీడలు, మహిళలకు ఫిట్‌నెస్ రన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం సర్టిఫికెట్స్, మెడల్స్, షీల్డ్‌లను అందజేశారు. ఫిట్‌నెస్ రన్నింగ్‌లో మొదటి బహుమతి మినాక్షి, రెండవ బహుమతి కావ్య, మూడవ బహుమతి సంతోష పొందారు. వాలీబాల్ విభాగంలో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. కోనాపూర్ టీం మొదటి బహుమతి, రాంనూంతల టీం రెండవ బహుమతి పొందారు. ఖోఖో విభాగంలో మొదటి బహుమతి రాంనూంతల జట్టు, మేడిగడ్డ జట్టు రెండవ బహుమతి పొందారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు, పీడీలు జ్యోతి, ఆనంద్ పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

రక్తదాత పాతకోట సాయిబాబాను సన్మానిస్తున్న స్త్రీ వైద్య నిపుణురాలు శారద

ఆమనగల్లు, మార్చి14 : రక్తదానం మహాదానమని స్త్రీ వైద్య నిపుణురాలు శారద అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన మేఘన అనారోగ్యంతో బాధపడుతూ స్థానికంగా ఉన్న ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఆమెకు రక్తశాతం తక్కువగా ఉన్నందున చికిత్సకు రక్తం కావాలని తెలియగానే మెగాస్టార్ చిరంజీవీ అభిమాని సంఘం నాయకుడు పాతకోట సాయిబాబా దవాఖానకు చేరుకుని రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబాను దవాఖాన డాక్టర్ శారద సన్మానించారు. కార్యక్రమంలో రమేశ్, ప్రకాశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

పెద్దఅంబర్‌పేట, మార్చి 14: ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ స్థలాల్లోకి చొరబడినా, అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి పసుమాముల గ్రామం సర్వే నంబర్ 386లోని నిర్మాణాలను తొలగించారు. ఈ సర్వేనంబర్‌లో నిర్మించిన పలు బేస్‌మెంట్లను గతంలోనే తొలగించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ స్థలాల్లోకి రావొద్దన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సమావేశంలో మాట్లాడుతున్న పైముదా

చేవెళ్లటౌన్, మార్చి 14: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పైముదా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కాలనీలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు సుభాన్ రెడ్డి, సత్తిరెడ్డి, మగ్బుల్, అంజయ్య, వెంకటమ్మ, సుగుణమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు, తండావాసులు

కడ్తాల్, మార్చి 14 : సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మాజీ సర్పంచ్ భీక్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్ అన్నారు. గురువారం గాన్గుమార్లతండా గ్రామ పంచాయతీలోని ఆంజనేయస్వామి ఆలయంలో తండావాసులతో కలిసి వారు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి లక్ష్మణ్‌నాయక్ రూ.51వేలు, భీక్యానాయక్ రూ.51వేలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని తెలిపారు. విరాళాలు అందించిన దాతలను ఆలయ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పాండునాయక్, శ్రీనూనాయక్, భీమన్‌నాయక్, సూర్యా, రాజు, గోప్యా, పాపు, శంకర్, సక్రు, వినోద్, జగన్ పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

చేవెళ్లటౌన్, మార్చి 14: మహాశివరాత్రి సందర్భంగా చేవెళ్లలో వారం రోజులుగా కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు గురువారం ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి అర్చనలు, హారతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అఖండహారతితో గురువారం ఉత్సవాలు ముగిశాయి.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, మార్చి 14: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడి దోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చందనవెల్లి, కొమరబండ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులు అనారోగ్యానికి గురైన వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ సుధాకర్‌రెడ్డి, వైద్యసిబ్బంది శ్రీను, సాగర్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

మొయినాబాద్, మార్చి14: ప్రభుత్వ భూములను కాపాడాలని చిలుకూరు మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి అన్నారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. చిలుకూరు రెవెన్యూలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 277లో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేయడంతో పాటు పకడ్బందీగా హద్దులు ఏర్పాటు చేసి ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

విత్తన వంగడాలపై రైతులకు అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారిణి తులసి, ఏఈవో రాజేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, మార్చి 14 : టీఎస్ఎఫ్-87 తెల్లకుసుమ మినినీకిట్ వెరైటీని రైతులు వాడాలని మండల వ్యవసాయ అధికారిణి తులసి అన్నారు. విత్తన పరిశోధనలో భాగంగా గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంపల్లిలో రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీ విడుదల చేసిన టీఎస్ఎఫ్ -87 తెల్లకుసుమ మినీకిట్ వెరైటీ, గత పదేండ్ల క్రితం రిలీజ్ చేసిన ఐఎస్ఎఫ్-764 చెక్ వెరైటీల మధ్య వ్యత్యాసాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ ఐఎస్ఎఫ్-764 చెక్ వెరైటీ ఎకరాకు 5 క్వింటాళ్లు పండితే, టీఎస్ఎఫ్-87 తెల్లకుసుమతో ఎకరాకు 6 క్వింటాళ్ల తెల్లకుసుమలు పండుతున్నాయని, గింజ నాణ్యత, లావుగా ఉండడంతో అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి రాజేశ్వర్‌రెడ్డి, రైతులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బైకును ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషయం

చేవెళ్ల రూరల్, మార్చి 14 : అతివేగం.. నిర్లక్ష్యంగా కారు నడపడంతో మహిళ మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని పామెన- అల్లవాడ ప్రధాన రోడ్డులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. షాబాద్ మండలంలోని బొబ్బిలిగామ గ్రామానికి చెందిన భార్యాభర్తలు మల్లయ్య, నవనీత గురువారం పనినిమిత్తం చేవెళ్లకు ద్విచక్రవాహనంపై వస్తుండగా పామెన- అల్లవాడ ప్రధాన రహదారి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న స్విఫ్ట్ (టీఎస్06 ఈఎఫ్4086) కారు అతివేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవనీతకు తీవ్ర గాయాలు కావడంతో చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండ గా ఆమె మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త మల్లయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. అతివేగం.. నిర్లక్ష్యంగా కారు నడపడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బ్రహ్మం తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేస్తున్న అభిలాశ్

తుర్కయంజాల్, మార్చి 14 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని కొహెడ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం తిరుపతి అన్నారు. పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు తొర్రూర్‌కు చెందిన భీమిడి అభిలాశ్ వారి కుటుంబ సభ్యులు భీమిడి రాజిరెడ్డి, రుక్కమ్మల జ్ఞాపకార్థం గురువారం పరీక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా .. అధికారులపై దాడికి యత్నం

- భార్యాభర్తలతోపాటు మరి కొందరిపై కేసు నమోదు

మొయినాబాద్, మార్చి 14 : ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసి రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదయ్యింది. చిలుకూరు గ్రామంలోని సర్వేనంబర్ 277లోని ప్రభుత్వ భూమిని సురభి ఎన్‌క్లేవ్ రియల్ వ్యాపారి కబ్జా చేసి ప్రైవేట్ వెంచర్‌ను ఏర్పాటు చేశాడు. అందులో ని ప్లాట్లను ఇతరులకు విక్రయించాడు. ఈ క్రమంలోనే మేకల కల్యాణ్‌చక్రవర్తి, శ్రీదేవి దంపతులు ఆ వెంచర్‌లో ప్లాటు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నారు. కాగా చిలుకూరు గ్రామంలోని సర్వేనంబర్ 277లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నదని స్థానికుల ఫిర్యాదుల మేరకు మంగళవారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ సిబ్బందితో కలిసి భూమిని పరిశీలించేందుకు వెళ్లారు. ఆ భూమిని సర్వే చేయగా శ్రీదేవి, కల్యాణ్‌చక్రవర్తి దంపతులు తన ఇంటి ప్రహరీని ప్రభుత్వ భూమిలో నిర్మించినట్లు తేలింది. ప్రభుత్వ భూమిని ఎందుకు కబ్జా చేశారని అడుగుతున్న క్రమంలో ఇంట్లో ఉన్న కల్యాణ్‌చక్రవర్తి ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని అంటారా .? అంటూ తహసీల్దార్‌తో గొడవకు దిగాడు. సంబంధిత పత్రాలు చూపకుండా దుర్భాషలాడుతూ అతడి భార్య, సహచరులతో కలిసి సిబ్బందిపై దాడికి యత్నించాడు.అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు, దాడికి యత్నించి నట్లు బుధవారం మొయినాబాద్ పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేయగా... గురువారం వారు శ్రీదేవి, కల్యాణ్‌చక్రవర్తి దంపతులతోపాటు మరి కొందరిపై ఐపీసీ 447, 353, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులకు క్యారం బోర్డు అందజేస్తున్న దాదె మహేశ్ తదితరులు

షాబాద్, మార్చి 14: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్ దాదె మహేశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్యారంబోర్డును అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, అనురాధ, లిఖిత, వనజ, ఆకృతి ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్లు నవిత, నుజ్మ, మాజీ వార్డు సభ్యుడు పల్లాటి నరేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆమనగల్లు, మార్చి 14 : పదోతరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంఈవో సర్దార్‌నాయక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు కేంద్రాల్లో 560 మంది, కడ్తాల్ మండలంలోని 3 సెంటర్లలో 513మంది, తలకొండపల్లి మండలంలోని 2 సెంటర్లలో 356 మంది, మాడ్గుల మండలంలోని 3సెంటర్లలో 495 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు మొత్తం 4 మండలాల్లోని 10 సెంటర్లలో 1,924 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన చెప్పారు.

అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమనగల్లు, మార్చి 14 : అనుమానాస్పదస్థితిలో మానసిక రోగి మృతి చెందిన ఘటన ఆమనగల్లు ఠాణా పరిధిలో జరిగింది. ఎస్ఐ బాల్‌రామ్ కథనం ప్రకారం .. మున్సిపాలిటీ పరిధి పెంటతండాకు సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి (70)మృతి చెంది రోడ్డు పక్కన ఉన్నాడని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికెళ్లి మృతదేహాన్ని పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు 5.8 అడుగుల ఎత్తు, కోల ముఖం ఉంటుందని.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆమనగల్లు, మార్చి 14: శెట్టిపల్లి గ్రామానికి చెందిన కటుకూరి సాయిలు, గడియ యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించాడు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశాడు.